
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 13 మార్చి 2025



ఉష్ణోగ్రత : గరిష్ఠం 36.4 కనిష్ఠం 15.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:31
(గురువారం సాయంత్రం)
సహర్: 5:03 (శుక్రవారం ఉదయం)

హోయివే



రోడ్డు మధ్యలో డివైడర్‌పై విరబూసిన రంగురంగుల పూలు వాహనదారులను కనువిందు చేస్తున్నాయి. అటుగా వెళ్లే వారు ఆగి మరీ ఫొటోలు తీసుకుంటున్నారు. కొత్తూర్ నుంచి షాద్‌నగర్ వెళ్లే పాత జాతీయ రహదారిపై ఈ దృశ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.
- కొత్తూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా పెద్ద రథోత్సవం



జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చుక్కాపూర్ సమీపంలోని కల్కి, దోన గుట్ట వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున పెద్ద రథోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సిద్ధాంతి పట్టాభి రామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- తలకొండపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి)



యాచారం: అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

ఉదయమే పనులు పూర్తి చేసుకోవాలి

» జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

కందుకూరు/యాచారం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఉపాధి హామీ కూలీలు ఉదయం పూట పనులు పూర్తి చేసుకోవాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కందుకూరు, యాచారం మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పని ప్రదేశాల్లో తాగు నీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వర్షాకాలం వచ్చేలోగా నర్సరీల్లోని మొక్కలను నాటడానికి సిద్ధం చేయాలన్నారు. యాచారంలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న సమావేశ మందిరాన్ని పరిశీలించారు. గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయడంపై శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా ఫాంపాండ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కందుకూరులో ఆయన వెంట ఎంపీడీవో సరిత, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, టీఏ గోపాల్, రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. యాచారంలో ఏపీవో లింగయ్య, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వంశి ఉన్నారు.

దివ్యాంగులకు 'యూడీఐడీ' సేవలు

» జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత

రంగారెడ్డి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం కొత్తగా యూడీఐడీ పోర్టల్ అందుబాటులోకి వచ్చిందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత అన్నారు. పోర్టల్‌పై కలెక్టరేట్‌లో బుధవారం దివ్యాంగుల సంఘం ప్రతినిధులకు, సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారానే దివ్యాంగులకు వైకల్యం శాతం, వైద్యుల నిర్ధారణ, కార్డు మంజూరు సేవలు అందనున్నట్లు తెలిపారు. సదరం శిబిరంలో వైద్య నిపుణులు వైకల్యాన్ని నిర్ధారించి శాతాన్ని పోర్టల్‌లో నమోదు చేస్తారన్నారు. దివ్యాంగుల్లో ఇప్పటివరకు ఏడు కేటగిరీల వారికి మాత్రమే అవకాశం ఉండగా ప్రస్తుతం పోర్టల్‌లో 21 కేటగిరీలను చేర్చినట్లు చెప్పారు. అర్హులకు యూడీఐడీ కార్డును స్పీడ్ పోస్టు ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే పంపనున్నట్లు తెలిపారు. జిల్లాకు వనస్థలీపురం, గాంధీ ఆసుపత్రిని కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సంధ్యారాణి, డీపీఎం విజయశ్రీ, ఏపీఎం జంగయ్య, ఎస్ఎస్ సిబ్బంది జయ, నర్సింహ పాల్గొన్నారు.

కునికిపాట్లు

ఇబ్రహీంపట్నం ఘటనతో 'డీపీఎల్'కు బ్రేక్!

మూడేళ్లుగా క్యాంపుల ఊసెత్తని ప్రభుత్వం
ట్యూబెక్టమీ, వెసెక్టమీ ఆపరేషన్లే దిక్కు
ప్రైవేటులోనే కుటుంబ నియంత్రణ సర్జరీలు
వైద్యం వికటించి ఇటీవల ఓ మహిళ మృతి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు అంటే అందరికీ ట్యూబెక్టమీ, వెసెక్టమీ ఆపరేషన్లే గుర్తుకువస్తాయి. అయితే ఎలాంటి కోత లేకుండా నిర్వహించే డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ల(డీపీఎల్)పై ప్రభుత్వం 'కుని'కిపాట్లు పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం ఘటనతో నిలిచిపోయిన ఈ ఆపరేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. అవి కూడా ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి.



రంగారెడ్డి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు రెండు, మూడో కాన్పు తర్వాత ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఇటీవల చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్ర ఆపరేషన్ కోసం వచ్చిన ఓ మహిళా వైద్యం వికటించి మృతి చెందింది. దీంతో డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్లపై ఆసక్తి చూపుతున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకుంటే ప్రభుత్వమే రూ.1,100 చెల్లించేది. ప్రైవేటులో ట్యూబెక్టమీ ఆపరేషన్ చేసుకుంటే వారం పాటు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది. రూ. 10 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాగే మరో 15 రోజుల పాటు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. డీపీఎల్ ఆపరేషన్ అయితే.. కేవలం మూడు, నాలుగు గంటల తర్వాత డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుంది.

ఇబ్రహీంపట్నంలో ఏం జరిగిందంటే..

ఇబ్రహీంపట్నంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2022 ఆగస్టు 25న 34 మందికి డీపీఎల్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయగా, వారిలో

మిగతా 8వ పేజీలో...

వెసెక్టమీ ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	వెసెక్టమీ (ప్రభుత్వ)	వెసెక్టమీ (ప్రైవేట్)	మొత్తం
2021-22	27	0	27
2022-23	21	01	22
2024-25	06	02	08

ట్యూబెక్టమీ ఆపరేషన్లు

సంవత్సరం	డీపీఎల్ క్యాంపు	ట్యూబెక్టమీ (ప్రభుత్వ)	ట్యూబెక్టమీ (ప్రైవేట్)	మొత్తం
2021-22	7,223	672	7,925	15,820
2022-23	1,933	459	4,475	6,867
2024-25	0	200	1,218	1,418

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువ కు.ని ఆపరేషన్లు

2021-22 సంవత్సరంలో డీపీఎల్ క్యాంపు ద్వారా 7,223 మంది మహిళలు కు.ని ఆపరేషన్ చేయించుకున్నారు. 2022-23లో 1,933 మంది మహిళలు సర్జరీలు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెలా 80-145 వరకు డీపీఎల్ క్యాంపుల ద్వారా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసుకునే వారు. ప్రభుత్వం క్యాంపులు ఏర్పాటు చేయకపోవడంతో కు.ని ఆపరేషన్ల కోసం ప్రైవేట్ ఆస్పత్రుల వైపు చూస్తున్నారు. నమ్మకం లేక ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ట్యూబెక్టమీ ఆపరేషన్లు ఎక్కువగా జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



పరిశ్రమలను పరిశీలిస్తున్న అధికారులు

సిప్లాన్ ఫార్మాకు నోటీసులు


రంగారెడ్డి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని చాకలిగుట్ట తండా పరిధిలోని సిప్లాన్ ఫార్మా పరిశ్రమకు అధికారులు నోటీసులు జారీ చేశారు. పరిశ్రమ నుంచి కాలుష్యం వెదజల్లుతుందని మండల పరిధిలోని తండా ప్రజలు పంచాయతీ కార్యదర్శి రవీంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఎంపీడీవో సుమతి, ఎంపీవో తేజ్‌సింగ్‌కు తెలిపారు. బుధవారం ఎంపీడీవో, ఎంపీవో సిప్లాన్ ఫార్మా పరిశ్రమను పరిశీలించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. కాలుష్యాన్ని నియంత్రించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు యాచారం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. యాచారం పెట్రో మొబైల్ పోలీసులు మండలంలోని చింతపట్ల సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా ఉన్న లారీని ఆపి తనిఖీ చేయగా 30 ప్లాస్టిక్ సంచుల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఏదుల్ల నర్సింహ మండలంలోని వివిధ గ్రామాల్లో జనం నుంచి సేకరించినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వ్యాపారం ప్రారంభించినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20న తైబజార్ వేలం

ఆమనగల్లు, మార్చి12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలో 2025-26 సంవత్సరానికి గాను ఈనెల 20న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.2.75 లక్షల విలువైన డీడీని ఏదైన జాతీయ బ్యాంక్‌నుంచి తీసి ఈనెల 19వ తేదీ వరకు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అదేవిధంగా కోడి వ్యర్థాల సేకరణ వేలంకు రూ.25 వేలు డీడీ అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేలం నిర్వహిస్తామని శంకర్ నాయక్ తెలిపారు.



బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ముస్తాబైన దేవుని పడకల్ వెంకటేశ్వరస్వామి ఆలయం

6

మా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపండి

» నేదునూరు గేటు వద్ద ఆరు గ్రామాల అఖిలపక్ష నేతల ధర్నా



మహాధర్నాలో అఖిలపక్ష నాయకులు, ప్రజలు

కందుకూరు,మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు, మహేశ్వరం, యాచారం, ఇబ్రహీపట్నం, మంచాల, కడ్తాల్, అమనగల్లు మండలాల్లోని పలు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తోంది. అయితే కందుకూరు మండంలోని అన్ని గ్రామ పంచాయతీలను అందులో విలీనం చేయాలంటూ బుధవారం మండంలోని నేదునూరు గేటు వద్ద బాచుపల్లి, పులిమామిడి, జైత్వారం, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్ పంచాయతీలకు చెందిన అఖిలపక్ష నాయకులు మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1983లో అప్పటి సీఎం ఎన్‌టీ రామారావు హయాంలో ఏర్పడిన కందుకూరు మండలం దినదినాభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మండంలోని 35 గ్రామ పంచాయతీలలో 27 పంచాయతీలను ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తుందని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, మిగిలిన ఎనిమిది గ్రామాలను కలిపి మహేశ్వరంలో విలీనం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మండంలోని అన్ని గ్రామాలను ఒకే కార్పొరేషన్‌లో కలపాలని, లేని పక్షంలో గ్రామ పంచాయతీలుగా ఉంచాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు రోజువారీగా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్, ఎమ్మెల్యే, మంత్రుల నివాసాలకు వెళ్లి నిరసనలు చేస్తామని తెలిపారు. స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేయడానికి సైతం వెనుకాడమని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, కాసుల రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, సోలిపేట అమరేందర్‌రెడ్డి, రాఖేష్‌గౌడ్, వెంకటేష్, కుమార్, కృష్ణనాయక్, మనోహర, కత్తుల వెంకటేశ్, కృష్ణ, సురేష్, పాండుగౌడ్, కృష్ణారెడ్డి, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత, నాణ్యత పాటించకుంటే చర్యలు

» ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ఉదయ్ కిరణ్



రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న ఉదయ్‌కిరణ్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్లు, హోటళ్లలో శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ఉదయ్ కిరణ్ హెచ్చరించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి బైపాస్ రోడ్డులో ఉన్న రెస్టారెంట్లను బుధవారం తనిఖీ చేశారు. రసోయి, ప్యారడైజ్ తదితర హోటళ్లలో వంట గదులను, ఆహార పదార్థాలను పరిశీలించారు. పాడైన ఆహార పదార్థాలను గుర్తించి, డస్ట్‌బిన్‌లో వేయించారు. ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్న వస్తువుల శాంపిల్స్‌ను తీసుకువెళ్లారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామని, వంటలకు వినియోగిస్తున్న ఆహార పదార్థాల శాంపిల్స్‌ను తీసుకెళ్తున్నామని తెలిపారు. వాటిని ల్యాబ్‌కు పంపి వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మేడిగడ్డ - శంకర్ కొండ కత్వవాగుపై పూర్తయిన వంతెన స్లాబ్

చకచకా వంతెన నిర్మాణం

» కత్వవాగుపై జోరుగా బ్రిడ్జి పనులు
» మేడిగడ్డ, శంకర్‌కొండ రోడ్డులో తీరనున్న కష్టాలు
» నెలరోజుల్లో ప్రారంభానికి సిద్ధం!

ఆమనగల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పడిన కష్టాలు వంతెన నిర్మాణం చకచకా సాగుతుండడంతో తేలుగుతాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ - శంకర్ కొండ రోడ్డులో కత్వవాగుపై వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ఆయా తండాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3.10 కోట్లతో పనులు

మేడిగడ్డ - శంకర్ కొండ కత్వవాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు ఆయా తండాల గిరిజనులు ఏళ్లుగా

మిగతా 8వ పేజీలో...

పనులు త్వరగా పూర్తి చేయాలి



మేడిగడ్డ- శంకర్ కొండ రోడ్డులో కత్వవాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వర్షాకాలం నాటికి వినియోగంలోకి తేవాలి. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వాగుపై వంతెన లేక దశాబ్దాలుగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎట్టకేలకు వంతెన నిర్మాణం తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉంది.
- ప్రశాంత్ నాయక్, శంకర్‌కొండ

జాతీయ సాంస్కృతిక విభాగంలో

బలరాంకు ప్రథమ బహుమతి


బలరాం

ఇబ్రహీంపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నేనావత్ బలరాం జాతీయ సాంస్కృతిక విభాగంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. ఇటీవల ఒడిశాలోని బరంపూర్ యూనివర్సిటీ వేదికగా జరిగిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో తెలంగాణ తరఫున బలరాంతో పాటు ఆరుగురు విద్యార్థుల బృందం తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాలు, పోతరాజుల విన్యాసాలు, బతుకమ్మ ఆటపాటలను ప్రదర్శించారు. కాగా, పోతురాజుల విన్యాసంతో అలరించిన బలరాంకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్. రాధికతో పాటు అధ్యాపక బృదం బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బలరాంను అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమార్కెట్ యార్డు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఇతర వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించడం జరుగుతుందని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి. రాములు తెలిపారు. బుధవారం చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులందరూ ఏపీలోని అనంతపురం, కర్నూల్, మదనపల్లి తదితర వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతుల కోసం అక్కడి ప్రభుత్వాలు, అధికారులు చేపడుతున్న విధానాలను క్షేత్రస్థాయిలో మార్కెట్ పాలకవర్గం సభ్యులు, అధికారులు తెలుసుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రధాన మార్కెట్ యార్డులను సందర్శించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటన రెండు రోజుల పాటు ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జనార్ధన్, మల్లేష్, నరేందర్, యాదయ్య, హనీఫ్, బాలయ్య, యాదిరెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్‌గౌడ్, కృష్ణారెడ్డి,వెంకట్‌రెడ్డి, మార్కెట్ అధికారులు తదితరులు ఉన్నారు.


అనంతపురంలో మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న చేవెళ్ల మార్కెట్ పాలకవర్గ సభ్యులు

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- ఎనిమిది రోజుల పాటు కొనసాగనున్న జాతర
- దేవుని పడకల్‌లో భక్తులకు వసతుల కల్పన
- 17న తిరుకల్యాణం.. 18న రథోత్సవం

తలకొండపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అతి ప్రాచీన దేవాలయంగా ఖ్యాతిగాంచి ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లో కొలువైన శ్రీ లక్ష్మీ అలివేలు మంగ, గోదాసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి(గురువారం) నుంచి 20వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయామానంగా అలంకరించారు. ఇక్కడ ఏక శిలలో శ్రీదేవి, భూదేవి, విశ్వక్సేన సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై వేంచేసి ఉండడం ఓ ప్రత్యేకత. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, ఆరాధకులు నడాదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు వివరించారు. 13న అభిషేకం, రుత్విక్‌కరణం, స్వస్తివాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పన, 14న ఆదివాసం, ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, 15న పారాయణం, బలిహరణం, హంస వాహన సేవ, హనుమంత వాహనం, 16న పారాయణం, మోహిని సేవ, బలిహరణం, హోమం, గరుడసేవ, ఎదుర్కోళ్లు, 17న తిరుకల్యాణం, గజ వాహనసేవ, 18న నిజరూప దర్శనం, మహాభిషేకం, రథోత్సవం, 19న అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లంకాదహనం, అశ్వవాహనం, 20న చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ధ్వజారోహణం, పందెంగుండు పోటీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.


దేవుని పడకల్‌లోని వేంకటేశ్వరాలయం, స్వామివారి మూలవిరాట్

మహేశ్వరం ఏఎంసీ చైర్మన్‌గా కృష్ణానాయక్

- వైస్ చైర్మన్‌గా యాదయ్య నియామకం

మహేశ్వరం,మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం అధికారిక నియామకానికి బుధవారంతో తెరపడింది. 18 మందితో కూడిన మార్కెట్ కమిటీ నియామక జీవోను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు బుధవారం విడుదల చేశారు. చైర్మన్‌గా కృష్ణానాయక్, వైస్ చైర్మన్‌గా యాదయ్య, మెంబర్లుగా పుష్ప, ప్రశాంత్‌కుమార్, యుగందర్, సురేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంఏ జావీద్, అల్లె భిక్షపతి, పాండురంగారెడ్డి, యాదయ్య, ధన్‌పాల్‌రెడ్డి, పాండులతో పాటు మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్, డివిజన్ వ్యవసాయాధికారి, మహేశ్వరం గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారితో కలుపుకొని కమిటీ పాలకవర్గం జీవోను మార్కెటింగ్ వ్యవసాయ శాఖ ప్రకటించింది. చైర్మన్‌గా నియమితులైన కృష్ణానాయక్ మాట్లాడుతూ మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ పాలకవర్గంతో పాటు అధికారుల సూచనలు, సలహాలతో చైర్మన్‌గా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


కేఎల్లార్‌ను కలిసిన కృష్ణానాయక్, యాదయ్య


లబ్దిదారులకు బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అర్హులందరికీ రేషన్ కార్డులు

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 114 మంది లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొత్త రేషన్‌కార్డులతో పాటు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండలంలో కొత్తగా 760 రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. ఒక్క చేవెళ్ల పట్టణ కేంద్రంలోనే 114 మందికి కార్డులను అందించినట్లు తెలిపారు. చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య, మున్సిపాల్ కమిషనర్ పూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జె.లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జి.రాములు పాల్గొన్నారు.

రైతుబిడ్డకు గ్రూప్-2లో 27వ ర్యాంకు

శంకర్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని కొత్తపల్లికి చెందిన ఒగ్గు చంద్రకాంత్ రాష్ట్రంలో 27వ ర్యాంక్ సాధించి శభాష్ అనిపించాడు. ప్రస్తుతం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2024 డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాలలో సైతం రాష్ట్రంలో 27వ ర్యాంకు సాధించి జూనియర్ అసిస్టెంట్‌గా సెలక్టయ్యాడు. 2018లో పోస్ట్ ఆఫీస్‌లో మెయిల్ క్యారియర్‌గా ఎంపికై చేవెళ్ల మండలంలోని ఆలూరు, తంగేడిపల్లిలో 45రోజుల పాటు విధులు నిర్వహించాడు. తదనంతరం మెయిల్ క్యారియర్ జాబ్‌కు రిజైన్ చేశాడు. 2023లో జూనియర్ లెక్చరర్(సివిక్స్) పరీక్ష వ్రాయగా 2024లో ఫలితాలు వచ్చాయి. అందులో రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించాడు. మార్చి 12న బుధవారం నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. జూనియర్ లెక్చరర్ నియామకపత్రం తీసుకున్నా గ్రూప్-2లోమంచి పోస్టు వస్తే ఎంచుకుంటానని చంద్రకాంత్ తెలిపాడు. కాగా, రైతు బిడ్డ కష్టపడి చదివి వరుసగా నాలుగు ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు వినోద, విఠలయ్యలతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రకాంత్ అన్న శ్రీకాంత్ కానిస్టేబుల్‌గా గచ్చిబౌలిలో విధులు నిర్వహిస్తున్నాడు.


కుటుంబీకులతో ఒగ్గు చంద్రకాంత్

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన సౌందరరాజన్


వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న సౌందరరాజన్

మొయినాబాద్‌రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సౌందరరాజన్ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నగరంలో బుధవారం సాయంత్రం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసానికి వెళ్లి చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి శేషవస్త్రంతో పాటు ఆశీర్వచనాలు అందించారు. ఈసందర్భంగా సౌందరరాజన్ మాట్లాడుతూ వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆలయం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించామన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియారంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చెక్కల శ్రీశైలం ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ కేంద్రంగా పనిచేస్తూ రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీశైలంకు తోటి జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. అర్హత కల్గిన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు, ఇంటి స్థలం, ఆరోగ్య బీమా, రవాణా సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానని, జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని, సమాజంలో ఆదర్శంగా నిలువడానికి శిక్షణ తరగతులను సైతం నిర్వహిస్తామని శ్రీశైలం పేర్కొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత

మొయినాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చికెన్ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీస్‌లు అరెస్టు చేసి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బుధవారం రాత్రి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ గేట్ సమీపంలో ఏజేఆర్ చికెన్ సెంటర్‌లో గంజాయి అమ్ముతున్నట్లు మొయినాబాద్ పోలీస్‌లకు పక్కా సమాచారం అందింది. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్, ఎస్సై నర్సింహరావులు అజీజ్‌నగర్‌లోని ఏజెఆర్ చికెన్ సెంటర్‌లో తనిఖీలు చేయగా 2.5 కిలోల గంజాయి దొరికింది. దాంతో షాపులో ఉన్న మహబూబ్‌ను అదుపులోకి తీసుకుని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్‌లు వివరించారు.


పట్టుబడిన మహబూబ్

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

రంగారెడ్డిఅర్బన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన రామానుజరెడ్డి వ్యవసాయ పొలం వద్ద బుధవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లో స్పార్క్ కారణంగా నిప్పు రవ్వలు కిందిపడ్డాయి. అయితే, భూమిపై ఎండు గడ్డి ఉండటంతో నిప్పంటుకుంది. దాంతో మంటలు చెలరేగి ట్రాన్స్‌ఫార్మర్ వరకు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా.. ఫ్యూజ్ లూజ్ కనెక్షన్ ఉండటం వల్ల షార్ట్‌సర్క్యూట్ అయ్యిందని.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పిస్తున్న కరీం అన్సారీ

ఆర్టీఐతో సమాచారాన్ని పొందొచ్చు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టం ద్వారా పౌరులు ప్రజాస్వామిక సంస్థల సమాచారాన్ని పొందుతారని రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్(ఆర్టీఐ) కార్యకర్త కరీం అన్సారీ అన్నారు. వెంకటాపూర్‌లో గల అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన ఆర్టీఐపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. దేశంలో ఆర్టీఐ చట్టం శక్తిమంతమైందన్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ అమను మతులు పొందిన సంస్థల సమాచారాన్ని పౌరులు ఆర్టీఐ కింద అప్లై చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజాధన దుర్వినియోగం, అవినీతిపై ప్రశ్నించగలిగే శక్తి ఆర్టీఐ పౌరులకు కల్పించిందన్నారు. యూఆర్టీఐ వెబ్‌సైట్ ఆర్టీఐ అభ్యర్థనలను సులభతరం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ కార్యకర్తలు పరమేశ్, కామేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మచెరువు కట్టపైకి భారీ వాహనాలను నిషేధించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీందర్

మేడ్చల్ టౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ తుమ్మచెరువు కట్ట మీద భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు పానుగంటి రవీందర్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే సొంత డబ్బుతో తుమ్మ చెరువు కట్టపై సీసీ రోడ్డు వేయించారని తెలిపారు. సీసీ రోడ్డు సామర్థ్యం భారీ వాహనాలను తట్టుకోదని తెలిపారు. ఇప్పటికే సీసీ రోడ్డు బీటలు వారిందన్నారు. కట్టకు ఇరు వైపులా బారికేడ్లు పెట్టి పాఠశాలల బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాల నిషేధించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుమాధవ్

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులివ్వాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగలకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని సంఘం ప్రధానకార్యదర్శి అవశందార్ వేణుమాధవ్ డిమాండ్ చేశారు. కొరైముల పరిధి సుప్రభాత్ టౌన్‌షిప్‌లో బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, సింగరేణి ప్రాంతాల్లో నివసిస్తున్న రిటైర్డ్ కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ల్లో నివసించేందుకు అనుమతివ్వాలి, హైదారాబాద్‌లో సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కార్యాలయం నిర్మించాలని, ఇంటి నిర్మాణానికి 200గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మున్నూరు కాపు మహిళలు

మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మేడ్చల్ టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు మహిళా మ్యాక్స్ సంస్థ ఉన్నత కార్యనిర్వాహణ అధికారి సర్దార్ పుటమ్ పురుషోత్తంరావు అన్నారు. మున్నూరు కాపు మహిళల పరస్పర సహకార సంఘం లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని బుధవారం మేడ్చల్‌లోని అత్వెల్లిలో నిర్వమించారు. పురుషోత్తంరావు మాట్లాడుతూ... మున్నూరు కాపుల ప్రధాన వృత్తి వ్యవసాయమన్నారు. ఆర్థిక వృద్ధి సాధించేందుకు వివిధ వృత్తుల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

గ్రామాలను సందర్శించిన డీపీవో

ధారూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): కేరెల్లి, చింతకుంట గ్రామాలను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సందర్శించారు. నర్సరీలను, వర్మి కంపోస్టు షెడ్‌లను ఆమె పరిశీలించారు. ఆయా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను ఆమె తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ మహిపాల్

పాలన చేతకాకే అరెస్టులు

దౌల్తాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించందని దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్ ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచ్‌లు, మాజీ జడ్పీటీసీ, ప్రజాప్రతినిధులను అరెస్టు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేసి నిధులు ఖర్చు చేసినా మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం నేటి వరకు పెండింగ్ బిల్లులు అందించకపోవడం శోచనీయం అన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతునొక్కే ప్రయత్నంలో భాగంగానే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. గ్యారంటీలను అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మాజీ సర్పంచ్‌లు శిరీష, రమేశ్, బుడ్డప్ప, మంజులాల్ నాయక్, పాండునాయక్, హరికృష్ణ తదితరులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మోమిన్‌పేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ జి.వెంకట్ హెచ్చరించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి సారా, మట్కా, పేకాటను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలుంటే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రండెన్ డ్రైవ్‌ల్లో పట్టుబడితే జరిమానా, జైలుశిక్ష తప్పవన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై అరవింద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకాలు

- విద్యార్థి అరెస్ట్ 1.30కిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవనానికి అలవాటు పడ్డ విద్యార్థి, తాను చదువుతున్న కాలేజీలోనే స్నేహితులకు గంజాయి విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయికి అలవాటు పడ్డ రాజు.. డబ్బుల కోసం తన కళాశాలలోనే సాటి విద్యార్థులకు గంజాయి విక్రయించడం ప్రారంభించాడు. బీదర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి, నగరానికి తెచ్చి చిన్న ప్యాకెట్లలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం నిఘాపెట్టి, గంజాయి అమ్ముతున్న రాజును అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.3కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కోట్‌పల్లి: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కోట్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి, ఇందోల్, ఒగ్లాపూర్, బుగ్గాపూర్, అన్న సాగర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామీణులకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.

తాండూరు రూరల్: తాండూరు మండలం ఉద్దండాపూర్‌నకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.8లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. హైదర్‌మియా ఇంటి నుంచి గోరేసాబ్ ఇంటి వరకు, తానోజీ ఇంటి నుంచి గొల్ల శామప్ప ఇంటి వరకు రోడ్డును వేస్తారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ఆనంద్‌రావు, హరిశ్చందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాజు, హుస్సేనప్ప, రియాజ్, మహేందర్‌రెడ్డి, ప్రదీప్, రాజు, శ్రీనుగౌడ్, శామప్ప పాల్గొన్నారు.



తాండూరు మండలం ఉద్దండాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

ధారూరు: మోమిన్‌కుర్దులో సీసీ రోడ్డు పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ప్రారంభించారు. సీసీరోడ్డుకు ఎంపీ కోటా నిధులు రూ.5లక్షలు మంజూరయ్యాయి. నాగిరెడ్డి ఇంటి నుంచి పి.రమేశ్ ఇంటి వరకు 135మీటర్ల సీసీ రోడ్డు వేస్తారు. ఇందుకు మాధవరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, రమేశ్, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, అర్జున్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



నీటి కోసం కారోబార్‌ను నిలదీస్తున్న మహిళలు

తాగునీటి కటకట.. పట్టించుకోని అధికారులు

దోమ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్‌లోని మూడో వార్డులో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని బుధవారం మహిళలు కారోబార్ శ్రీశైలాన్ని నిలదీశారు. నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ధారూరు బాలుర పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు

పాఠశాలలో ఎస్‌ఈఈఆర్‌టీ తనిఖీలు

ధారూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): ధారూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను మంగళవారం ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు తనిఖీ చేశారు. పదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు, విద్యార్థుల జవాబు పత్రాలను ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు డాక్టర్ వనజ, డాక్టర్ వనిత తనిఖీలు చేశారు. పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు టీ-శాట్ అంశాలు, తరగతుల బోధన, ఉపాధ్యాయుల డైరీలు, రికార్డులు, టైం టేబుల్‌ను పరిశీలించారు. బేస్‌లైన్, మిడ్‌లైన్ టెస్టులు, పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల జవాబు పత్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు



మైలారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

దోమ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారంలో గల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ను ంచి ఈ నెల 16 వరకు ఆలయ 19 వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకుడు మూడావత్ రాములునాయక్ బుధవారం తెలిపారు. 13న విశ్వక్సేనపూజ, పుణ్యాహఃవచనం, రక్షాబంధనం, వాస్తు హోమం, అంకురార్పణ, 14న సుప్రభాతం, ఆరాధన సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, తీర్థప్రసాద గోష్ఠి, స హస్రనామ పారాయణం, ఊంజల్ సేవ, 15న సు ప్రభాతం, నిత్య ఆరాధన సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి, నిత్యాహవనం, 16న సుప్రభాతం, నిత్యారాధన, హోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం, శ్రీవారి క ల్యాణోత్సవం, పల్లకీ సేవ, పుష్పయాగం, ఏకాంత సేవ, ఆశీర్వచనాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు భారీసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో హబీబ్ అహ్మద్

కులకచర్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బోధనలో ప్రతిభ కనబర్చి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఎంఈవో హబీబ్‌అహ్మద్ అన్నారు. బుధవారం కులకచర్ల, చౌడాపూర్ మండలాల చెందిన 2008-డీఎస్సీలో ఎంపికైన ముగ్గురు సమగ్ర శిక్ష ఉద్యోగులు కృష్ణయ్య, విద్యాసాగర్, సతీశ్‌కుమార్‌లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వారిని సన్మానించారు. సమగ్ర శిక్షణలో అనుభవం పొంది బోధనకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, బాగా బోధించి గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో చౌడాపూర్ ఎంఈవో రాంచందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేశ్, రాఘవేందర్ రెడ్డి, గులాం, విజయ్ శ్రవణ్‌కుమార్, నర్సిములు, సతీశ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



బోయపల్లి తండాలో సభలో అధికారులు, ఉపాధి కూలీలు

కొడంగల్ రూరల్, 12(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. బుధవారం బోయపల్లితండా, పలు గురాళ్లతండా, పాటిమీదిపల్లి, పోచమ్మతండాల్లో అధికారులు సభ నిర్వహించి చేసిన పనులపై కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయితీ కార్యదర్శులు, కూలీలు, అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌లే అడ్డాగా చోరీలు

షాద్‌నగర్ రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి) షాద్‌నగర్ పట్టణ శివారులో ఉన్న డబుల్ బెడ్ రూంలను అడ్డాగా చేసుకొని పలు కాలనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలు అక్కడే నివాసముంటూ సమీప కాలనీల్లో తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం న్యూ తిరుమల కాలనీకి చెందిన రాజేష్ అనే ఉపాధ్యాయుడు ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ విధులకు వెళ్లాడు. ఈక్రమంలో దొంగ ఇంట్లోకి బీరువా తాళం కూడా విరగ్గొట్టి అందులో ఏమీ దొరక్కపోవడంతో పక్కనే ఉన్న కనకయ్య వరండాలోకి వెళ్లాడు. అక్కడ ఇంటి తాళం విరగ్గొడుతుండగా చుట్టుపక్కల వాళ్లు చూడటంతో గోడ దూకి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే పట్టణంలోని మాతా టెంట్‌హౌజ్ గోదాంలో పది రోజుల కింద తెల్లవారుజామున ముగ్గురు దొంగలు గోదాంలోకి వెళ్లి మూడు సంచుల్లో సామగ్రి నింపుకున్నారు. అనంతరం పారిపోతుండగా వాకింగ్‌కు వెళ్లేవాళ్లు పట్టుకున్నారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో షాద్‌నగర్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు మాత్రం నమోదు చేయకుండానే దొంగను వదిలేశారు.



కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి హోలీ జరుపుకుంటున్న లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు

ముందస్తు హోలీ

కడ్తాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రంగుల కేళి హోలీ వేడుకలను కడ్తాల మండల కంద్రంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, సురేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

● డిప్యూటీ తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారం గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న మైనింగ్ అనుమతులు రద్దు చేయాలంటూ వీరన్నపేట్, పద్మారం, లక్ష్మీదేవిపల్లి గ్రామస్థులు బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పద్మారం శివారులోని సర్వేనంబర్ 185లో మైనింగ్ ఏర్పాటు చేస్తే చుట్టు పక్క గ్రామాలైన లక్ష్మీదేవిపల్లి, పద్మారం, వీరన్నపేట్, పెద్ద ఎల్కిచర్ల, గ్రామాలకు చెందిన రైతులతో విచారణ చేసి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్నారు. మైనింగ్ ఏర్పాటు చేస్తే చుట్టూ ఉన్న పంట పొలాలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించినవారిలో సలీం, యాదగిరి, యూసుఫ్, గౌస్, శివకుమార్, ఖదీర్, అజీమ్, కృష్ణ, బాలయ్య, ఎక్బాల్, రాజు, శేఖర్, ఖాజా, ఆజం, గోపాల్, రామాంజనేయులు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 12: (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహులు, మాజీ ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, కావలి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ సీతారాములు, మలేష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. హాజిపల్లి రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. షాద్‌నగర్ నుంచి హాజిపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరలో అర్హులందరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, హౌసింగ్ డీఈ షేక్‌మహ్మద్, ఎంపీడీవో బన్సీలాల్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

కొత్తూర్ : ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మక్తగూడ, మక్తగూడ గ్రామపంచాయతీలోని పెద్దగుట్టతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మొదటి విడతలో మక్తగూడ గ్రామపంచాయతీకి 20ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లీనా, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాందాస్‌నాయక్, కాంగ్రెస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, జంగ నర్సింహ, నాయకులు అంబటి ప్రభాకర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, దయానంద్‌గుప్త, మోది దర్శన్, బోకుల రాజు, వడ్డే శేఖర్, గుండు ఆంజనేయులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చకచకా వంతెన నిర్మాణం

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. వంతెన లేక బస్సులు కూడా రాని పరిస్థితి. వాగుపై వంతెన నిర్మించాలని గిరిజనులు ప్రభుత్వం, ప్రజా ప్రతినిదులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద వంతెన నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరై నెలలు గడిచినా పనులు చేపట్టకపోవడంతో గిరిజనులు మేడిగడ్డ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. 2022 సెప్టెంబరు 6న వంతెన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. కొన్ని నెలలతర్వాత వంతెన నిర్మాణానికి గోతులవరకు పనులుచేసి వర్షపునీరు వచ్చిందన్న సాకుతో వదిలేశారు. తర్వాత ఏడాది గడిచినా కూడా పనులు మాత్రం ప్రారంభించలేదు.

ఇప్పటికే స్లాబ్ నిర్మాణం పూర్తి

వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో 2023 జూన్ 11న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే వంతెన నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పనులను పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మూడు నెలలకు పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టారు. నిధులు విడుదల కాక బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేశాడు. పనులు ముందుకు సాగకపోవడంతో వర్షాలకు వాగు ప్రవాహం పెరగడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతూ వచ్చారు. గతేడాది స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో తిరిగి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వంతెన స్లాబ్ నిర్మాణం పూర్తి కాగా, పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏప్రిల్ చివరి వరకు పనులు పూర్తి చేసి వర్షాకాలంలో గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చకచకా పనులు చేస్తున్నారు. డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అబిషేక్, ఎంపీడీవో కుసుమ మాదురి పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి.

నెలరోజుల్లో పనులు పూర్తి



ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.3.10 కోట్లతో మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో వంతెన నిర్మాణం పనులు చేపట్టాం. మొదట్లో పనుల్లో కొంత జాప్యం జరిగినా ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే వంతెన స్లాబ్ నిర్మాణం పూర్తయ్యింది. నెల రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేసి వంతెన ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్ రెడ్డి, డీఈఈ, ఆమనగల్లు

'కుని'కిపాట్లు

నలుగురు చనిపోయారు. (మమత, సుష్మ, మౌనిక, లావణ్య) మిగతావారిని వెంటనే వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంది. ఆపరేషన్లు చేసిన డాక్టర్ జోయల్ సునీల్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసింది. రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ ఝాన్సీపై బదిలీ వేటు వేసింది. వీరితో పాటు మొత్తం 13 మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మార్గదర్శకాలు జారీ చేసింది.

వెసక్టమీకి నై..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వాసెక్టమీకి పురుషులు దూరంగా ఉంటున్నారు. కేవలం అపోహలే దీనికి కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. వెసక్టమీ గణాంకాలు పరిశీలిస్తే ఇదే విషయం తేటతెల్లమవుతుంది. వాసెక్టమీకి దూరంగా ఉంటూ ఇల్లాలిదే అన్నట్లు ఆడవాళ్లకు ట్యూబెక్టమీ చేయిస్తున్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ పథకాల అమలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ నాయకులు విష ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.56 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు రూ.200 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఆయా మండలాల నాయకులు ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గ్యార నర్సింహ, తాళ్లరవీందర్, విజయ్‌రాథోడ్, సురేందర్‌రెడ్డి, బాబా, తదితరులు పాల్గొన్నారు.

మంతన్‌గౌరెల్లిని ఫ్యూచర్‌సిటీలో కలపండి



యాచారం : ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రమందజేస్తున్న మంతన్‌గౌరెల్లి నాయకులు

యాచారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌరెల్లి, కేస్లీ తండాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని మంతన్‌గౌరెల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు అరవింద్‌నాయక్‌తో పాటు పలువురు బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రమందించారు. ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తే తమ గ్రామాలు ఎంతో అభివృద్ధిచెందుతాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామాల ప్రగతిపై చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో అధికారులకు వివరించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు చెప్పారు. శ్రీనివాస్, సీత, హరిసింగ్, సేవాలాల్, యాదయ్య, మధుకర్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

ఇబ్రహీంపట్నం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికులు ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రమందజేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ నాయకుడు పోచమోని కృష్ణలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 15 నెలల బిల్లులు, వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్మికులకు నెలకు పదివేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'మోడల్'కు తాగునీరు

● హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు

ఆదిబట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పాయి. వారం రోజులుగా నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు మున్సిపల్ పరిధిలోని శ్మశాన వాటిక దగ్గర ఉన్న బోరును రిపేర్ చేయించి కొత్త మోటారు బిగించి మోడల్ స్కూల్‌కు నీరు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదర్శ పాఠశాలకు నీరు అందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు 24 గంటలు నీటి సరఫరా ఉండే విధంగా శ్మశాన వాటిక నుంచి స్కూల్ వరకు 500 మీటర్ల పైపులైన్ వేశామన్నారు. దీంతో పాటు హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి పాఠశాలకు పర్మినెంట్‌గా నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్త చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ అమరావతి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, డీఈ సర్వణ్‌కుమార్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు తాగునీటి సమస్యతో సతమతమవుతున్న విద్యార్థుల ఆవేదనను గమనించిన బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం నాయకులు ఉచితంగా వాటర్‌క్యాన్‌లను పంపిణీ చేశారు. జేర్కోని రాజు, తిరుమల్‌రెడ్డి, రాజ్‌కుమార్, ప్రవీణ్‌నాయక్, శివసాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచేడ్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం నిత్యపూజలు, పారాయణం, గీతాలాపన భజలు, అమ్మవార్లకు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త పుట్టపాగ రాంచందర్ రావు, ఆలయ నిర్వాహకుడు తిరుమల వింజమూరు రామానుజాచార్యులు, ప్రధాన అర్చకులు ఆచార్య ఆదిత్య, చిందంబర శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భారతమ్మవిఠలయ్యగౌడ్, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

యాచారం : మండల కేంద్రంలోని శ్రీయజ్ఞవాల్క్యాశ్రమంలో వేదపండితులు శ్రీ సీతారామచంద్రస్వామి వారి విగ్రహప్రతిష్ఠ చేసి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయంలో పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. ఉదయం 4గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సీఐ ఆంజనేయులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంగోత్ వెంకటేష్ నాయక్, భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

తిరుపతిరెడ్డిని కలిసిన రాములు



ఆమనగల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్యలతో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలను నాయకులు ఆయనకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించినట్లు చెప్పారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

కడ్తాల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తుందని పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రానికి భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కడ్తాల మండలం రావిచేడ్ గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులను బుధవారం శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపాఉ. ఈకార్యక్రమంలో నాయకులు జనార్ధన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా

ఆమనగల్లు, మార్చి12(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వేల మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. 50కి పైగా కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 25న కల్వకుర్తి పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మేళాకు సంబంధించిన పోస్టర్లను ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాఘవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే జాబ్ మేళాను నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సభ్యులు శ్రీరాములు, అనిల్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : జూలపల్లిలో బుధవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు ముదిగొండ సంజీవయా దిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక సమస్యలు, వర్గీకరణకు చట్టబద్ధపై పోరాటం తదితర విషయాల గూర్చి చర్చించారు. ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద అనిల్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, ప్రచార కార్యదర్శిగా జగదీశ్, కార్యదర్శులుగా బాలస్వామి, మల్లికార్జున, మహేందర్, ఆంజనేయులు, రాజ్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, లింగం, అభిలాష్, ఉదయ్, శాంతయ్య, జంగయ్య, వెంకటయ్య, తదితరులను ఎన్నుకున్నారు.

ఆమనగల్లు : సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా నియమితులై తొలిసారిగా ఆమనగల్లుకు వచ్చిన ఏబీవీపీ పూర్వవిద్యార్థి నాయకుడు ప్రేమ్ నాయక్‌కు ఆమనగల్లులో ఘన స్వాగతం లభించింది. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయనను నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కో-కన్వీనర్ రవిరాథోడ్, నాయకులు లక్ష్మణ్, బాలు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లికి చెందిన తాళ్ల శేఖర్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ద్వారా రూ.35 వేల సీఎంఆర్ఎఫ్ మంజూరు కాగా.. చెక్కును ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ బాధితునికి అందజేశారు. మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, నాయకులు రవి, సందీప్, పర్వతాలు, శివ, తదితరులున్నారు.

మాడ్గుల : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు వార్షిక పరీక్షలు ఉంటాయని, మొత్తం 452మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో సర్దార్ చెప్పారు. మాడ్గుల మండల కేంద్రంలో రెండు సెంటర్లు, ఇర్విన్ ఒక సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేశంపేట : మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ మైనార్టీ మండలాధ్యక్షుడు ఇబ్రహీం నిత్యావసర సరుకులు అందించారు. అలాగే ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలలో 24 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిందని తెలిపారు. మరికొంత మంది కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందనుందని వివరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలిపారు.

కేశంపేట : అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ తాజా మాజీ సర్పంచ్‌లు ఆందోళన చేస్తారని భావించిన కేశంపేట పోలీసులు మాజీ సర్పంచ్‌ను అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డిని ఉదయం అరెస్ట్ చేశారు. అయితే, తన ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రిలో చికిత్స పొందిన పత్రాలు సీఐ నరహరికి వాట్సాప్‌లో పంపడంతో పెట్రోలింగ్ పోలీసులు మాజీ సర్పంచ్‌ను వదిలేశారు.

కేశంపేట : మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 158 మంది విద్యార్థులు హాజరైనారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ అజాంఅలీ పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. సిట్టింగ్‌స్క్వాడ్ శివకుమార్ పర్యవేక్షించారు.

యాచారం : ఇష్టంతో చదివి ఉన్నతిలోకి రావాలని, ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. పరీక్షా సమాధాన పత్రంలో కొట్టివేతలు, దిద్దులుండరాదని సూచించారు. ఎస్సై తేజం రెడ్డి, హెచ్ఎం సత్తు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

యాచారం : ఎస్సీ వర్గీకరణకు నేడు జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించడంతో పాటు గ్రూప్-1,2,3 తదితర ఉద్యోగాల ఫలితాలను వెల్లడించరాదని డిమాండ్ చేస్తూ బుధవారం రెండో రోజు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. నరేందర్, శ్రీకాంత్, లక్ష్మయ్య, మహేందర్ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : మండల పరిధి చెర్లపటేల్‌గూడలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువైద్య శిబిరం నిర్వహించారు. 49 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 30 పశువులకు సాధారణ వ్యాధుల చికిత్స, 70 పశువులకు నట్టల నివారణ మందులు, 25 పశువులకు ఎదకు రావడానికి చికిత్స, 105 పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలు వేసినట్లు ఎలిమినేడు పశు వైద్యాధికారి ఆనంద్‌రెడ్డి చెప్పారు.

తలకొండపల్లి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు మాదిగల పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 3వ రోజుకు చేరాయి. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు అన్ని రకాల ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలుపుదల చేయాలని కోరుతూ చేపట్టిన దీక్షలను చంద్రదన మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ ప్రారంభించారు. వర్గీకరణ అమలుకు మాదిగలంతా ఏకం కావాలని కృష్ణ పిలుపునిచ్చారు. సంజీవ, అనిల్, శ్రీశైలం తదితరులున్నారు.

క్రైం కార్నర్

విద్యార్థి ఆత్మహత్య కేసులో ప్రిన్సిపాల్, పీఈటీ రిమాండ్

షాద్‌నగర్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్ర పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ప్రిన్సిపాల్, పీఈటీలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 5న సాయంత్రం నీరజ్(15) అనే విద్యార్థి పాఠశాల మొదటి అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో విద్యార్థి తండ్రి హరిభూషన్.. ప్రిన్సిపాల్, టీచర్ల వేధింపుల వల్లే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. అన్నికోణాల్లో విచారణ జరిపిన పోలీసులు ప్రిన్సిపాల్ నరేందర్ రాయ్, పీఈటీ కరుణాకర్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డ శ్రీశైలం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఎ.శ్రీశైలం(58) వారం రోజుల క్రితం పొలం నుంచి నడచుకుంటూ వచ్చి రోడ్డు దాటుతుండగా యాచారం నుంచి గున్‌గల్ వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. దాంతో అతడు తీవ్రంగా గాయపడ్డారు. యాచారం పెట్రోమొబైల్-1 పోలీసులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. మృతుడికి భార్య సునిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీచర్..

కొత్తూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బైపాస్ రహదారిపై పెంజర్ల చౌరస్తా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రైవేట్ ఉపాధ్యాయురాలు జ్యోతి(42) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కృష్ణవేణి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జ్యోతి ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తుండగా.. చౌరస్తా వద్ద మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మినీ వ్యాన్‌డ్రైవర్ ఆమెను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

ఆమనగల్లు, మార్చి12(ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో గొడవపడి దాడికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లితండా కుచెందిన జటావత్ గోపాల్, ఈనెల 4న భూమి విషయంలో అతని తల్లిదండ్రులు సీత, పాండ్యాలతో గొడవపడ్డాడు. వారిని తీవ్రంగా దూషించడమే కాకుండా భార్య తారి, కుమారుడు చింటూలతో కలిసి కర్రలతో దాడి చేశారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణాపూర్ గేట్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపాల్‌కు చెందిన షేక్‌పాషా వృత్తిరీత్యా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కాగూడలో మేస్త్రీ పని ముగించుకుని బైక్ స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కాలు, చేయి విరిగినట్లు తెలిపారు. స్థానికులు, కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకుని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

భగవద్గీతను తప్పక చదవాలి

శంకర్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హిందూ సోదరులందరూ భగవద్గీతను తప్పక చదవాలని భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి తెలిపారు. శంకర్‌పల్లిలోని సేవా ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరేష్‌కుమార్, జయరాంరెడ్డిలు నగరంలోని గంగాధర శాస్త్రి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పాటించి నుదుట తిలకం దిద్దుకోవాలని సూచించారు. విదేశీ సంస్కృతిని అనుసరించడం వల్ల హిందూ సంస్కృతి నాశనం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో దేశ భక్తిని కలిగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేణేంద్రచారి తదితరులు ఉన్నారు.

ప్రకృతి సేంద్రియ రైతుల సమ్మేళనం-2025 పోస్టర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేంద్రియ రైతుల సమ్మేళనం-2025 ఏప్రిల్ 4, 5వ తేదీలలో నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లిలోని అతిథిగృహంలో బుధవారం సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జినుగుర్తి ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బద్దం సురేందర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ హాజరవుతారని తెలిపారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

షాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని, తమకు న్యాయం చేయాలని భూ నిర్వాసితుల సంఘం మండలాధ్యక్షుడు నీరటి అంజనేయులు అన్నారు. బుధవారం చందన్‌వెల్లి భూ నిర్వసితులు అసెంబ్లీని ముట్టడించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంజనేయులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, అసలైన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క షాబాద్‌లో పాదయాత్ర చేసినప్పుడు కాంగ్రెస్ అధికారంలోని వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలను లేవనెత్తి మాకు న్యాయం చేయాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు జంగయ్య, ప్రధానకార్యదర్శి అనంతం, ఉపాధ్యక్షులు రెడ్డయ్య, నర్సింహులు, భూనిర్వాసితులు రాంబాబుగౌడ్, దయాకర్, బాలయ్య, కృష్ణగౌడ్ తదితరులున్నారు.

విద్యారంగం అభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయించాలి

● ఏబీవీపీ నాయకుల డిమాండ్

చేవెళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది విద్యార్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఏబీవీపీ నాయకులు శివ, ప్రేమ్, సంధ్య, పూజిత తదితరులు ఉన్నారు.